# యాళాయిశేషం

మా ఊరి పేరు మిద్దూరు.

మా తాతముత్తాతల కాలాన వాళ్లకు వాళ్లకు పడకుండా పూరికొంపలకు దొంగసాటుగా మాటు మణిగిన యాళకాడ అగ్గిపెట్టుకున్నారంట. అగ్గి పెట్నె యాళాయిశేషం! గాలి తిప్పించి మల్లించి కొట్టేకుందికి గెడిసేపిట్లో యాడిదాడ బూడిదై పొయ్యిందంట. ఆ బూడిదిని చూస్తా మాతాత అంతపనికి వగతెగించిన గాడ్డికొడుకుల్ను-

''ఒరే ముండమోపి నాయండ్లాలా! పూరి కొంపలనిగదరా కాల్చేసి కండ్లచూస్తా ఉండారు. అదే మిద్దిండ్లయితే?'' అని మీసాలు మెలేస్తా నిలబడుకుణ్నోడు నిలబడుకుణ్నెట్టే మూడుంముక్కాలు గెడికి మిద్దిండ్లనే కట్టించేసినాడంట! అప్పిటికి ఆ పాయికట్లో తొలీతగా కట్టించిన మిద్దిలు అవ్వేకాబట్టి అది మిద్దూరయింది.

మిద్దూరికి సరిగ్గా నాలుగు మైళ్ల దూరాన తూరుపు తట్టుగా పాతగుంట పరంటపక్కగా పెనుమూరు ఉండాయి.

బుదువారం నాడు పెనుమూర్లో బేస్తారం నాడు పాతగుంటలో సంతలు జరగతాయి. మిద్దింటి కోడాలుగా మాయమ్మ సంసారం చేసినా బుదువారంనాడు పెనుమూరు సంతకు ఎరగడ్డలు బేస్తారంనాడు పాతగుంటకు తమలపాకులు మోసేదిమాత్రం తప్పలేదు.

దినమ్మూ అయితే మా అయ్యను అమ్మను కోడికూత నిద్దరలేపేది. అదే

బుదువారమో బేస్తారమో అయితే యీళ్లే తొలి కోడిని నిద్దర లేపేవాళ్లు. ఆసోబోసోమని మా అయ్య బానామోకు బుజానపెత్తే మాయమ్మ బండీకదురుగోలు బుజానపెట్టేది. రాళ్లబాయిలో మోటగట్టే దానికి ఎలబార్తే యింక మా రామన్న ఎద్దుగొడ్లను తోలుకోని ఎంటపడేవాడు. ఆ భాయిలో మోటగట్టి మా అయ్య రాగాలుతీస్తావుంటే ఊళ్లో రాముడారిగుళ్లో సప్పరం గెంటలు సడిచేసినట్టుండేది. మా రామన్న కొంగు పట్టుకోని ఎంట తిరగతావుంటే మాయమ్మ వరిమడికి నీళ్లు పెట్టి గెనిమిల మింద తిరగతా కయ్యిలో నీళ్లు కలగల్సినాయో లేదో అని ఆ చీగిట్లో కండ్లు చించుకోని చూస్తావుండేది. కలగలిస్తే యింకొక కయ్యికు మడవ తిప్పేది. బల్లుమని తెల్లారేకుందికి వరిమడికి తడిపడ్తుంది. రాళ్లబాయిలో మోటయిడ్సి పెట్టారు. వుల్లా బానామోకు బండికదురుగోలు మోసుకోని బాడ్సిమాకలబాయి కాడికి పరుగోపరుగు. ఆ బాయిలో మోటకట్టారు. మా అయ్య మోటతోల్తా ఉంటాడు. మా యమ్మ పారశాత బట్టుకోని ఆకుతోటకు నీళ్లుకట్తుంది.

రొండు బార్ల పొద్దెక్కేకుందికి రొండు బావలకింద కయ్యిలకు తడిపడ్తుంది.

అప్పుడు మాఅయ్య మోట నిలిపేస్తాడు. మాయమ్మ పారశాతబట్టుకోని ఆకుతోట్లోనుంచి మోటబాయి కాడికొస్తింది. ఇద్దరు ఆ మోటకాలవ అడగన పేరుకోని పొయ్యింటుంది- సన్న యిసిక. ఆ యిసికినో లేకుండాపోతే ఆ కాలవపక్కల్లో గుబురు గుబుర్లుగా పెరిగుండే అంత గుంటగెంజారాకునో నోట్లో యేసుకుంటారు. నడినేలితో రొండుసార్లిట్టా రొండుసార్లట్టా తిమిడేస్తారు. ఆ కాలవలో ఎడగాలవ నీళ్లు పోతా ఉంటాయి. ఆ నీళ్లే రోన్నట్టా ఎత్తి నోట్లో పోసుకోని పుక్కిలించి ఊసేస్తారు. తడి చేతుల్తోనే మొకం అట్టా తుడ్సుకుంటారు. అప్పుడు మాయమ్మ మా అయ్య పైచవకాన్ని గుంజుకోని మొకం తుడ్సు కుంటావుంటే మాఅయ్య మాయమ్మ పైటకొంగును గుంజాకునే వాడు. రైకగుడ్డ ఏసుకుండే దానిగ్గూడా శాతగాని మాయమ్మ మెలికలు తిరిగిపోతా 'లోతుబావుల్లో మోట కొట్టికొట్టి బుడ్సలకాడికి యీడ్సక పోతావుంటే గూడా ఈ మొగోడి పెగ్గి పెనుమూరుదాకా పోతా ఉండాది గదమ్మా!' అంటా ఒక్కయిసుర్లో పైటకొంగును గుంజుకోని వొళ్లు కప్పుకుంటా చవకాన్ని యిసిరి మాఅయ్య మొకాన కొట్టేది. 'మెడమింద కాడిపెట్టే ఎర్రెద్దు ఎగిరి పణ్ణెట్టుండాది గదే?'' అని నవ్వతా మాఅయ్య అడుగుముందుకు ఎయ్యబోతాడు. సరిగ్గా అదే సమయానికి మా జయ్యమ్మక్క సద్దిదుత్త నెత్తిన పెట్టుకోని దిగబడ్తింది.

మా అయ్య కుశాల సప్పచల్లారిపోతింది. అప్పిటికే ఆవులేళ అవితింది.

''అయ్యయ్యో! ఏయరవకాడ లేచినా రాళ్లకాలవకాణ్ణే తెల్లారినట్టుండాదే బతుకు! సంతకు యాళైపోతా ఉండాదే?'' అని గొణుక్కుంటా సద్దిదుత్త చేతికందుకుంటారు. కల్లిప్పుతారు. చెరిరొండు దోసిళ్లు కూటిమెతుకులు గొంతుల్లో పోసుకుంటారు- నిన్నుపట్టు నన్నుపట్టంటానే. అన్నీ యేగించుకోని యిల్లుచేర్తారు.

అటికిమింద ఆరబోసిన ఎర్రగెడ్డలు. గోచిపేత ఎగచెక్కి మాఅయ్య అటికమిందికి ఎక్కతాడు. బుట్టితో ముంచి ముంచి ఎత్తిస్తా ఉంటే మా యమ్మ కింద నిలబడుకోని

అందుకుంటింది. అందుకోని నేలమింద కుప్పపోస్తింది. నాలుగువంణుగులు అవతాయనుకుంటే 'యింకచాలు దిగిరా!' అంటింది. మాఅయ్య దిగొస్తాడు. మాయమ్మ తక్కిడ పట్టుపకుంటింది. మాఅయ్య గోతం పట్టుకుంటాడు.

''ఒకటి... రొండు... లాబంగలుగు... నాలుగు!'' అంటా మాయమ్మ పదారు ఈశలు ఒకగోతానికి పదారు ఈశలు యింకొక గోతానికి తూచిపోస్తింది. మాఅయ్య మూటలుకట్టా ఉంటాడు.

''అది సరేయమా! ఒగిటి రొండూ నాలుగు అంటివే. మూడు ఏమయిపాయ? కప్పతినేసి పొయ్యిందా?'' అని అడిగితే–

''యాపారంలో మూడు పలికితే ముదనష్టం అయిపోతిందిరా. అందుకే లెక్క పొరబాటుగాకుండా లాబంగలుగు అంటా ఒకయీసె తూసిపోసుండ్లా?''

''నువ్వు చెప్పేది యిచ్చిత్రంగా ఉండాదిగదమ్మాయ వెంకటేశ్వరుడికి ఏసుండేది మూడే మూడునామాలు... పెండ్లిలో యేసేది మూడుముళ్లు... మనకుండే దేవుళ్లు ముగ్గురు...''

''ఒరే! నువ్వు పోరా చిలిపినాకొడకా! ఆమాట నన్నడిగితే ఎట్రా? పాయ్ మీ అప్పావు పిల్లఅయ్యోర్ని అడుగుపో!'' అన్నవ్వతా మాయమ్మ మాఅయ్య చెరొకమూట నెత్తికెత్తుకుణ్ణారంటే కాడికి గట్టిన గిత్తల మాదిర ఎనకాముందు చూసేవాళ్లుగాదు. పొద్దు నడిమిట్టన ఉంటింది. మాఅయ్య నెత్తిబొరువు పెనుమూరి సంతలో మాయమ్మ గుండెలమింద బొరువుగా మార్తింది. అయినా మాయమ్మ మొగలాయి.

''నేను అమ్ముకోని వొచ్చేస్తాను గానీ నువ్వుపద. గొడ్డూగోదా కట్టూగూటానా పడుంటాయి. లేదర బిడ్డలు. ఎదురుచూస్తా ఉంటారు.'' అని అంటానే మాయమ్మ ఆ సంతలో బాటపక్కన చెత్తా సెదారం తోసేసి సంచిపట్ట పర్సుకుంటింది. ఆ పట్టమింద ఎర్రగెడ్డలు కుప్పలు పెట్టి పల్చగా నెరిపితింది. ఆ సంచిపట్ట ముందర కూసుంటుంది. అప్పుడు మాయమ్మ ఎట్టుంటిందంటే పండగల్లో యింటిముందర పెట్టే తంగేడిపూల కుప్పల ముందర తీర్సిపెట్టిన గుమ్మిడిపువ్వు గొబ్బెమ్మ మాదిర్తో ఉండేది.

మేము ఎర్రగెడ్లు నాట్టా ఉండామనీ... సంతల్లో అమ్మి సంచులకు సంచులే దుడ్లు తెచ్చుకుంటా ఉండామనీ మా పెద్దయ్యోళ్లకు కన్నుగుట్టినట్టుండాది. దీన్నే దాయాది పోరంటారు. మామింద పోటాపోటీగా వాళ్లగూడా ఎర్రగెడ్డలు నాటేదానికి మొదులుపెట్నారు. ఇంక ఆ ఎర్రగెడ్డల్ను అమ్ముకోవాలగదా? వాళ్లగూడా పెనుమూరికి ఎత్తుకోని పొయ్యేవాళ్లు!

మాపెద్దయ్య కొడుకు అదే మాయన్న శాస్త్రాలు చెప్పేదాంట్లో శానాగెట్టోడు. ఆ పక్కపక్కంతా 'శాస్త్రాలాయిన! శాస్త్రాలాయిన! ' అంటా పేరు మోగిపోతా ఉండేది. అయితే

యాపారం కాడ మాత్రం ఆయన పప్పులేమీ ఉడికేటివి గావు. అప్పిటికి మాయమ్మ అడగనే అడిగేది.

''ఒరే అబ్బోడా! నువ్వు యింటికాడ కూసోని పంచాంగం ఎత్తి ముందరేసుకుంటే పావలాపరక వస్తింది గదరా? ఏదో ఒకదరకు వగదెంచి ఎర్రగెడ్డలు తూకం యేసెయ్‌రాదా?'' అని అడుక్కుంటే ముడుక్కుంటా బిడుక్కోల్ నై అంటే నై అనేవాడు.

''సరే! నీతలపాడు నువ్వు పడ్రా!'' అంటా మాయమ్మ గమ్మునుండేది.

పెనుమూరు సంతలో మాయమ్మ యింకా బారడు పొద్దుండాది అనంగానే నాలుగుమణుగుల ఎర్రగెడ్డలు అమ్మేస్తింది. అప్పిటికీ మా పెద్దయ్యకొడుకు అదే శాస్త్రాలాయిన సంతలో గుంతకూసోని ఈగిలు తోలుకుంటా ఉంటాడు.

పొద్దుగూట్లో పడ్తా పడ్తా ఉంటింది. ఎర్రగెడ్డల మింద ఈగిలు ముసర్తా ఉంటాయి. శాస్త్రాలాయిన మొకాన కత్తేటుకు నెత్తురుచుక్క ఉండదు. కొనుక్కోమని మాయమ్మను అడగలేదు. అడక్కుండా ఉండలేడు. తెచ్చినివి మల్లా వాపస్ తీసుకోని పొయ్యేదంటే నలగర్లో శానా బయిశాట్లు. అప్పుడు గునస్తా గునస్తా మాయమ్మ దగ్గిరికొస్తాడు.

''పినమా పినమా! పొద్దు పూడస్తా ఉండాది. ఏయదవ తొలీతగా బోణీ చేసినాడో ఏంపాడో? తెచ్చినవి తెచ్చినట్టే ఉండిపాయ. ఇవ్వట్టా తూకం యేసుకోయేమే!'' అంటా నంగి నంగిగా గోజార్తాడు.

ఇంక చూసుకో మాయమ్మ కత! తడిసిన ముడి బిర్రెక్కినట్టు బిర్రెక్కి పోతింది.

''పొద్దు కండ్లల్లో పెట్టుకోనొచ్చి తూకం ఏసుకోమంటే ఏసుకోని యిప్పుడేం చెయ్యాల్రా? పొద్దు పూడస్తా ఉండాదంటే నీకేనా నాగ్గూడానా? నేనడిగినప్పుడేమో నువ్వు తలకాయికి చెప్పులడిగితివి. ఇప్పుడు ఊడిపాయ జారిపాయ అంటే నేను మాత్రం ఏంచేసేది? శాస్త్రాలు చెప్పేబల్లి కుడితిలో పడేదంటే యిట్నేరా!'' అని వాగిసినట్టే వాగస్తా దడెం ఎచ్చూతక్కువగా తూకం ఏసుకుంటింది. చేతులు మారేకుందికి యాణ్ణించి వస్తారో ఏంపాడో ఆ జనం. ఎండబోసిన శాపల్ను గెద్దలు తన్నుకోని పొయ్‌నట్టు తన్నక పోతారు.

కన్జిగిటి పడా పడ్తా ఉంటింది. మాయమ్మ సంచిపట్ట యిదిలించేసి మడ్సి చంకలో పెట్టుకుంటింది. ఆ వారానికి కావాల్సిన ఉప్పూ పప్పూ కొనుక్కుంటింది. నెత్తిన మూట. పక్కన నేను. ఇంటిదోవ పట్టింది.

అప్పుడు నేను పెనుమూర్లో ఆరో తరగతి చదువుకుంటూ ఎర్రగెడ్డలామె కొడుకును!

దోవలో వస్తా వస్తా-

'అదిగాదే యమా! శాతొచ్చిన శాస్త్రాలాయిన అమ్ముకోలేని ఎర్రగెడ్డల్ను కొంచేపెట్లోనే నువ్వెట్టా అమ్మేసినావే?'' అని అడిగితే-

''అదెంతా ఎలబార్నె యాళాయిశేసం లేరా అబ్బోడా!'' అనేది.

శాస్త్రాలాయినకు తెలియని యాళాయిశేషం 'ఓ' కు వంపులు తెలవని ఈమె కెట్టా తెలిసిందబ్బా? అనుకుంటా అప్పుడేమో ఊకొట్టి ఊరుకున్నాను గానీ యిప్పుడు ఆ నాలుగ్గాళ్లమండపం కాడ నిలబడుకోని-

''సంస్తానాలన్నీ సమిసిపాయ. కోటలు పేటలు కొళ్లపాయ. ఆ కార్వేటినగరం సంస్తానంలో ఈ చంద్రగిరి కోటలో కేళీయిలాసాలన్నీ ఏగాలికి కొట్టుకోని పాయ్‌నాయో పాయ్‌నాయి. అటుమంటి చోట్లల్లో యిప్పుడు జిల్లేళ్లు మొలస్తా ఉండాయి. యాళాయిశేషం కాకుండాపోతే దీన్ని యింకేమనాల? మల్లా ఈ నాలుగ్గాళ్లమండపం చూడు. ఎప్పుడు చూడు నిలకేలేని జనం. కడగాలుపణ్ణె యాళాయిశేషం అంటే యిట్టాంటిదేనేమో?'' అని ఆలోచించుకుంటానే పైకి అనేసినా.

''నిజిమేరా అబ్బోడా! నిజిమే! అంతా యాళాయిశేషమే. నువ్వు యింట్లోనుండి ఎలబారింది... నేను యిల్లుకట్టుకుంటా ఉండేది... మన పిలకాయిలు పరీచ్చలు రాసేది... అంతా యాళాయిశేషమే. ఇంటికి యిల్లాలు గాటికి గొడ్డు దొంతికి కడవ ఊరికే రమ్మంటే వస్తాయనుకుణ్ణావా? ఎగిరిపడి లేచి సగం రేత్తిరికాడ ఎగబెట్టుకోని సొతంత్రాన్ని నిద్దరకండ్లతో తీసుకుణ్ణాంగదా? అందుకే మనబతుకులు యిట్టా నిద్దరపోతానే ఉండాయి. యాళాయిశేషం అంటే ఏమనుకుణ్ణావ్?'' అని తలకాయి ఎగరేస్తా నవ్వతా ఉండాడు ముత్తారెడ్డన్న.

నానోట్లోకి ఈగిలు దూరేది నాకే తెల్లేదు!●